# మినీ కథలు:

## సూర్యం వచ్చాడు

శాంతి శివప్రసాద్



అప్పుడే కళ్ళు నులుముకుంటూ పక్క మీద నుంచి లేచింది జానకమ్మ. ఒక సారి గడియారం వంక చూసి ఉలిక్కి పడింది. ఏడున్నర అయింది. అయినా సూర్యం యివాళ కూడా రాలేదన్నమాట. వస్తే యీపాటికి వచ్చేవాడేకదా? ఎప్పుడొచ్చినా ఆరు గంటలకే దిగుతాడు కదా! జానకమ్మ మనసులో రకరకాల ఆలోచనలు. వాటిని భగ్నం చేస్తూ పైకప్పు మీంచి టప్‌మని జానకమ్మ భుజం మీద రాలింది ఓ వానచినుకు. పాడుముసురు వారం రోజులనుంచి పట్టుకుంది. ఎక్కడ చూసినా తడి.. తడి.. ఇంట్లో వాళ్ళు బయటకు వెళ్ళటానికి వీల్లేదు. ఒకటే వర్షం. అందుకే సూర్యం రాలేదనుకుంది.

జానకమ్మ గుండెల్లో రాయి పడింది. ఇవాళకూడా సూర్యం రాకపోతే ఇల్లు గడిచేదెట్లా? బియ్యం అయిపోయి నాలుగు రోజులయింది. కూలిపనికి పోదామంటే ఈ ముసురు ఒకటి జిడ్డులాగా పట్టుకుంది. ఏమీ తోచటంలేదు. పిల్లలికి రోజూ పోసున్న గంజి నీళ్ళయినా యివాళ పొయ్యగల్గుతానో లేదో అని దిగులు పడింది జానకమ్మ. ఒక సారి బట్టలు వేసుకునే దండెం మీదకు చూపులు మరల్చింది. వున్న ఒక్కచీరె కట్టుకునేందుకు కూడా వీల్లేకుండా ముద్దయి వున్నది. అదెప్పటికి ఆరాలో. ఒక్కసారి నిట్టూర్చింది. ఏమైనాగాని సూర్యం వస్తే గాని. ఈ బట్టలబాధ. ఆకలిబాధ తీరేటట్లు లేదు. ఎప్పుడొస్తాడో ఏమిటో చీకటి పడేలోగా రాకపోతాడా అనే ఆశ మిణుకు మిణుకుమంటోంది జానకమ్మ మనసులో. మళ్ళీ ఒకసారి గడియారం వైపు చూసింది. తమ బతుకుల్లాగే అదీ రంగూ కాంతి కోల్పోతోంది రోజురోజుకూ. ఎప్పుడో తను పనిచేసే యింట్లో బాబుగారు మరో దేశం పోతూ తన భర్తకు యిచ్చిన పాత గడియారం అది. తన భర్త పోతూ పోతూ తన కోసం వదలి వెళ్ళిన ఆస్తి అదీ ఈ పిల్లలూ.

పిల్లలవైపు ఆప్యాయంగా చూసింది జానకమ్మ. పిల్లలిదరూ చలికి ముడుచుకుని ఒకళ్ళమీద ఒకళ్ళు చేతులు వేసుకొని అందులోనే వెచ్చదనం వెతుక్కుంటూ పడుకున్నారు. నేల చలదనానికి వున్న ఆ ఒక్క దుప్పటిముక్క చల్లగా అయిపోయింది. అయినా దానిమీదే పడుకున్నారు పిల్లలు. అదేదో పట్టుపరుపులా. వాళ్ళకు కనీసం చలినుంచి కూడా రక్షణ లేదు. ఆకలి బాధ ఒకవైపు. చలిబాధ ఒకవైపు. వీటన్నిటినుండి విముక్తి కావాలంటే సూర్యం రావాలి. వెయి కళ్ళతో ఎదురు చూస్తోంది జానకమ్మ.

మర్నాడు పొద్దున్నే ఎవరో కుదుపుతున్నట్లుగా వుంటే కళ్ళు నులుముకుంటూ చూసింది జానకమ్మ. దేముడ్నే చూసినంత సంతోషమేసింది. సూర్యం వచ్చాడు. సంతోషం పట్టలేకపోయింది. చక్కటి మందహాసంతో జానకమ్మ కళ్ళకు విందు చేస్తూ మబ్బుల్ని పక్కకు తోసూ కిటికీలోంచి తలుపుల్లోంచి లోపలికి ప్రవేశించాడు సూర్యం.... అదే సూర్యభగవానుడు!

★

---

## దాహం

జి. రాజేశ్వరరావు



ఎండ విపరీతంగా కాస్తున్నాది. నేనూ, నాతోపాటు అడుగులు వేస్తున్న ఈ ముగ్గురు కుర్రకుంకలూ తప్ప వేరెవ్వరూ లేరు రోడ్డు మీద. నీడనిచ్చే చెట్లు కూడా లేవు. ముగ్గురూ పసివాళ్ళే. అందరిలో చురుకుతనం ఉంది. భవిష్యత్తు మీద కొండంత ఆశ ఉంది. వీళ్ళకి ప్రేమ చదువు చెప్పాను. ఇప్పుడు పట్నం తీసుకువెళ్ళి పరీక్ష వ్రాయించి స్కూల్లో చేర్పించాలి. అందుకే ఎండలో ఈ ప్రయాణం.

ముగ్గురూ, నాలికలతడి ఆరి, నీళ్ళకు పరితపిస్తున్నారు. నాకూ దాహం వేస్తున్నా పసివాళ్ళనుచూసి. నా మాట మరచి వాళ్ళను మాటలలో పెట్టి ముందుకు సాగుతున్నాను. దూరాన తాటి మట్టలతో కట్టిన చిన్న పాక కనుపించింది. ఎవరో చలివేంద్రం నడుపుతున్నట్లున్నారు. ఆశగా వెళ్ళాను. ఎవ్వరి జాడ లేదుకానీ బల్లమీద ఒక కూజావుంది. ప్రక్కనే ఒక పెద్ద గ్లాసు కూడావుంది. కూజాను చేత్తో ఎత్తి చూశాను. ఉత్తది కాదు. అదృష్టం.

నాగన్నా! రారా నాయనా అని పిలిచి గ్లాసుడు నీళ్ళు వాడికి ఇచ్చాను. గుట గుట త్రాగి "ఇంకో గ్లాసుడు నీళ్ళు కావాలి మాస్టారూ" అన్నట్లు సౌంజ్ఞచేశాడు. మళ్ళా నింపాను గ్లాసు. నీళ్ళు త్రాగి. "చాలు మాస్టారూ" అన్నాడు. పాపం కుర్ర నాగన్నకు గొంతుక తడిసి మాట పెగిలింది. వెంటనే రాజుగాడు ఉరుకుతూవచ్చి గ్లాసు అందుకుని "నాకండీ మాస్టారూ" అన్నాడు. నీళ్ళు కాస్త అడుక్కి వెళ్ళాయి. నేనెత్తిన బరువులో నీటి బరువుకన్నా కూజా బరువే ఎక్కువ ఉండి ఉంటుందన విషయం తట్టగానే కాస్త జాగ్రత్త పడి కూజా మెల్లగా వంచుతూ గ్లాసులో పోశాను. బంగారం కంటె ప్రస్తుతం విలువైన ఈ నీళ్ళు క్రింద పడకుండా త్రాగిన గ్లాసు చేత్తో పట్టుకుని అసంతృప్తిగా "ఇంకొంచం కావాలండీ" అన్నాడు రాజు. నేను సంకోచిస్తూ కాసిన్ని పొయ్యబోతూ వుంటే "ఎందు